# రామన్న వెంటే..

## సిరిసిల్ల ప్రజలు

### ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుపు





బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల పరిశీలకులు, అధికారులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు తెరపడింది. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాలలో సిరిసిల్ల అభ్యర్థిగా కేటీఆర్ విజయకేతనం ఎగురవేశారు. అభివృద్ధి ప్రదాత రామన్న వెన్నంటే ఉంటామంటూ సిరిసిల్ల ప్రజలు మరోసారి రుజువు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినప్పటికీ, కేటీఆర్‌ను తమ ఎమ్మెల్యేగా గెలిపించుకొని కృతజ్ఞతను చాటారు. 2009 నుంచి వరుసగా సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన ఆయనకే, ఐదోసారి నియోజకవర్గ ప్రజలు పట్టంకట్టారు. నేతన్నల బతుకు చిత్రాన్ని మార్చినందుకు నేత కుటుంబాలు సైతం రామన్నకే జై కొట్టారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేటీఆర్ విజయం సాధించారు. రెండో స్థానంలో కాంగ్రెస్, బీజేపీకి మూడో స్థానం లభించింది. ఆదివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించారు.

#### ప్రతి రౌండ్‌లోనూ రామన్నకే మెజార్టీ

సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం 14టేబుళ్లు, 21 రౌండ్లు లెక్కించారు. ప్రతి రౌండ్‌లో కేటీఆర్‌కు ఓటర్లు మెజార్టీ ఇచ్చారు. కేటీఆర్‌కు 88,761 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డికి 58,916, బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమరెడ్డికి 29,710ఓట్లు వచ్చాయి. 29,687ఓట్ల మెజార్టీతో రామన్న గెలుపొందారు. మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,206, కాంగ్రెస్ 3,002, బీజేపీ 449, 2వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,547, కాంగ్రెస్ 2,190, బీజేపీ 1,285, 3వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,446, కాంగ్రెస్ 2,386, బీజేపీ 1,029, 4వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4,026, కాంగ్రెస్ 2,898, బీజేపీ 847, 5వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4105, కాంగ్రెస్ 2,525, బీజేపీ 1149, 6వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4,861, కాంగ్రెస్ 2,666, బీజేపీ 791, 7వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,457. కాంగ్రెస్ 3,020, బీజేపీ 736, 8వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 5,382, కాంగ్రెస్ 2,877, బీజేపీ 1,211, 9వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4,765, కాంగ్రెస్ 2,061, బీజేపీ 857, 10వ రౌండ్‌లో 6,216, కాంగ్రెస్ 2,081, బీజేపీ 1,204, 11వ రౌండ్ బీఆర్‌ఎస్ 6,076, కాంగ్రెస్ 2,308, బీజేపీ 1,149, 12వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 6,526, కాంగ్రెస్ 2,303, బీజేపీ 1,003, 13వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,388, కాంగ్రెస్ 2,665, బీజేపీ 656, 14వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4,455, కాంగ్రెస్ 3,281, బీజేపీ 552, 15వ రౌండ్‌లో 4,315, కాంగ్రెస్ 3,588, బీజేపీ 720, 16వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 3,558, కాంగ్రెస్ 3,944, బీజేపీ 932, 17వ రౌండ్‌లో 4,522, కాంగ్రెస్ 3,500, బీజేపీ 1,089, 18వ రౌండ్‌లో 3,574, కాంగ్రెస్ 4,124, బీజేపీ 913, 19వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 4,072, కాంగ్రెస్ 3,385, బీజేపీ 954, 20వ రౌండ్ బీఆర్‌ఎస్ 3,964, కాంగ్రెస్ 3,595, బీజేపీ 493, 21వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ 1,300, కాంగ్రెస్ 1,517, బీజేపీ 165 ఓట్లు వచ్చాయి.

#### కేటీఆర్ గెలుపుపై సంబురాలు

*సిరిసిల్ల శాసన సభ్యుడిగా కేటీఆర్ ఎన్నిక కాగా, ఆయన తరపున పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపా ణి, చీటి నర్సింగరావు, మండల శాఖ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, కుంబాల మల్లారెడ్డికి రిటర్నింగ్ అధికారి ఆనంద్‌కుమార్ కౌంటింగ్ హాల్‌లో ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఐదోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కేటీఆర్ గెలుపొందడంపై పార్టీ కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, చీటి నర్సింగరావు ఆధ్వర్యంలో నేతలు అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో నాయకులు సంబురాల్లో పాల్గొన్నారు.*



బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల పరిశీలకులు, అధికారులు

# ఆది నుంచి గులాబీయే

మెట్‌పల్లి, డిసెంబర్ 3: కోరుట్ల నియోజకవర్గం బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా నిలుస్తున్నది. పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడిన నియోజకవర్గానికి ఐదో సారి జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్సే విజయకేతనం ఎగరవేసింది. ఇక్కడి నుంచి 2009, 2010 (ఉప ఎన్నిక), 2014, 2018 ఎన్నికల్లో కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బీఆర్‌ఎస్ తరపున వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. తాజాగా ఆయన కొడుకు, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఐదుసార్లు బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయడం విశేషం. నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమం నాటి నుంచి బలమైన క్యాడర్ పట్టణ, గ్రామీణ స్థాయిలో ఏర్పడింది. మున్సిపాలిటీ నుంచి మొదలుకొని గ్రామ సర్పంచ్ దాకా, అలాగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సంఖ్య ఎక్కువ. ప్రతి ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్‌దే పై చేయిగా నిలుస్తూ వస్తున్నది. అందుకు స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని పట్టణం నుంచి పల్లెల దాకా పటిష్టమైన క్యాడర్‌ను ఏర్పరుచుకున్నారు. అలాగే నిత్యం ఆయన ప్రజలకు అందుబాటులో ఉండడం, ప్రజా సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధియే లక్ష్యంగా పనిచేయడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేయడం వల్ల అటు పార్టీ పటిష్టం కావడం, ఇటు తన కంటూ నియోజకవర్గంలో ప్రత్యేకతను ఏర్పరచుకోవడం జరిగింది. ఈ క్రమంలో తాజాగా ఎన్నికల్లో తన కొడుకు డాక్టర్ సంజయ్ గెలుపునకు ఈ అంశాలు ఎంతో దోహదపడిందని చెప్పవచ్చు. నియోజకవర్గంలో పరంపరగా కొనసాగుతున్న వరుస విజయాలతో గులాబీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

## వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్

- 14,581 ఓట్ల ఆధిక్యంతో చల్మెడపై గెలుపు

వేములవాడ, డిసెంబర్ 3: వేములవాడ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ విజయం సాధించారు. నవంబర్ 30న పోలింగ్ జరుగగా, ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఆది శ్రీనివాస్ 71,451 ఓట్లు సాధించారు. తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై 14,581 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2009 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ ఇప్పటికి నాలుగుసార్లు వరుస పరాజయాలను మూటగట్టుకున్న ఆది శ్రీనివాస్, పట్టువదలని విక్రమార్కుడి లాగా ఐదోసారి ప్రయత్నించి ఎట్టకేలకు తన కలను సాకారం చేసుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,22,251 ఓట్లకు గానూ 1,74,145 ఓట్లు పోల్ అయ్యాయి. ఆది శ్రీనివాస్‌కు 71,451 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు 56,870ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్ 29,710 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలువగా, బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్‌కు 4,649 ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్‌తోపాటు మిగతా అభ్యర్థులెవరూ డిపాజిట్ దక్కించుకోలేకపోయారు.

#### రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబర్ 3: శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని శనివారం వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆయనను ఆశీర్వదించగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి ప్రసాదం అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు .

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



కోల బన్నీసాయి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 3: బొప్పాపూర్‌కు చెందిన విద్యార్థి కోల బన్నీసాయి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 29న పెద్దపల్లి జిల్లా రామగిరిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన కోల బన్నీసాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 5 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం బన్నీని అభినందించింది.

## కోనరావుపేటలో దివ్యాంగుల దినోత్సవం

కోనరావుపేట, డిసెంబర్ 3: మండల కేంద్రంతో పాటు కనగర్తి గ్రామంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగులు ప్రధాన కూడళ్ల నుంచి ర్యాలీ తీశారు. ఇక్కడ దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు పల్లం లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఎల్లె రవీందర్‌రెడ్డి, పల్లం లింగయ్య, సిర్ర నర్సయ్య, మందాల సుధాకర్, బుర్ర భూమయ్య, కర్నాల భూమయ్య, నాయకుడు అనుపాటి బాపురెడ్డి తదితరులు ఉన్నారు.



కనగర్తిలో ర్యాలీ తీస్తున్న దివ్యాంగులు